కథ

# మనసా ఎటులోర్తునే..

పి.ఎస్. నారాయణ
99598 08862

"రేపు ఎండాకాలం సెలవుల్లో బదరీనాథ్ వెళ్దామనుకుంటున్నా.. నువ్వు కూడా వస్తావా?'' కేశవ్ అడిగాడు రాఘవని.

సాయంత్రం ఆరు గంటలప్పుడు వాళ్లిద్దరూ వాళ్ల ఇళ్లకు దాపులో ఉన్న పార్కులో కబుర్లు చెప్పుకొంటూ నడుస్తున్నారు. రోజూ ఓ గంటసేపు కాలక్షేపం. సంతోషాలు, కష్టాలు పంచుకుంటారు. దాదాపు నాలుగు సంవత్సరాలుగా జరుగుతున్న కార్యక్రమం అది. ఏడవుతుండగా ఇళ్లకు వెళ్తారు.

జనవరి మాసం. చలి తగ్గలేదు. అందునా ఈ సంవత్సరం మరింత ఎక్కువగా ఉన్నట్లనిపిస్తోంది.

ఇద్దరూ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్నారు. కేశవ్ తెలుగు, రాఘవ సైన్స్ సబ్జెక్టులు బోధిస్తారు. ఐదు సంవత్సరాల క్రితం ఒకేసారి చేరారు. ఒకరికొకరు ఆకర్షితులై త్వరలోనే ఆత్మీయ మిత్రులయ్యారు. నివాసం ఒకే బస్తీలో. రాఘవ తాతగారు దగ్గరలోనే ఉన్న గ్రామం నుండి వచ్చి మహబూబ్‌నగర్‌లో ఇల్లు కట్టుకుని స్థిరనివాసం ఏర్పరుచుకోవటంతో.. అది అతడికి వంశపారంపర్యంగా వస్తున్న ఇల్లు అయ్యింది. కేశవ్ వనపర్తి నుండి ఈ ఉద్యోగం వచ్చిన తరువాతే రావటంతో.. అద్దె ఇంట్లోనే ఉంటున్నాడు. ఇద్దరిదీ ముప్పై పైనే వయసు. రూపం కూడా తెలుగు మాస్టారే అనిపించేలా.. కేశవ్ ఎప్పుడూ ధోతి, లాల్చీనే ధరిస్తుంటాడు. అంట కత్తెర వేసిన జుట్టు, చిన్న శిఖ. రాఘవకు ప్యాంటూ, చొక్కా తప్ప.. ధోతి కట్టే అలవాటు లేదు. ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. కేశవ్‌కు ఓ పిల్లవాడు. కాస్త ఆలస్యంగా వివాహమైన రాఘవ ఇంకా తండ్రి కాలేదు.

''ఎందుకు అనుకుంటున్నావ్ అక్కడికి వెళ్లాలని!'' రాఘవ అడిగాడు.. కేశవ్‌నే చూస్తూ.

''నాన్న బతికున్నంత కాలం అంటుండే వాడు.. 'ఎన్నాళ్లుగానో బ్రహ్మకపాలం వెళ్లి మా పితరులకు పిండ ప్రదానం చేసి సద్గతులు కలిగించాలని అనుకుంటున్నా. సానుకూలం కావటంలేదు. ఇప్పుడా.. వయసు మీదపడటంతో అంతదూరం వెళ్లగలనా? అనే అధైర్యం కూడా పీడిస్తున్నది' అని. మనసులోని ఆ కోరిక నెరవేరకుండానే ఆయన వెళ్లిపోయారు. కన్నకొడుకుగా దానిని నిర్వర్తించి ఆయన ఆత్మకు తృప్తి కలిగించాలనేది నా ఆశ!''.

భార్య రమ.. బీఏ తరువాత తెలుగు పండిట్ చేసి ప్రైవేటు స్కూల్లో ఉపాధ్యాయినిగా చేస్తోంది.

అమ్మకు ఓపిక తగ్గటంతో రాలేదు. భార్యను తీసుకొని వెళ్దామన్నా.. పిల్లవాడు పసివాడు. అందుకే ఒక్కడే వెళ్దామనుకున్నాడు.

''తోడుగా నువ్వు వస్తానంటే నాకు ధైర్యంగానూ, ఆనందంగానూ ఉంటుంది!'' అన్నాడు రాఘవతో.

''వస్తాను కానీ, నేనక్కడ చేయాల్సిన కర్మకాండలేవీ లేవు. లక్ష్మీనారాయణున్ని దర్శించుకోవటం, హిమాలయాల అందాల్ని ఆస్వాదించటం.. అంతే!''

అతడి తండ్రి పదిహేను సంవత్సరాల క్రితం ఒకరోజు ఇంటినుండి వెళ్లిపోయాడు. ఎక్కడికి వెళ్లాడో తెలియదు. ఎక్కడున్నాడో తెలియదు. అసలు బతికి ఉన్నాడో లేదో కూడా తెలియదు.

''నీ అంగీకారం నాకు చాలా ఆనందం కలిగిస్తున్నది రాఘవా! ఇక ఆ ప్రయత్నంలో ఉంటాను. అక్కడ నిర్వర్తించాల్సిన కార్యక్రమాలకు ఎప్పుడు బావుంటుందో చూస్తాను!'' అన్నాడు మిత్రుడి చేతిని అందుకుంటూ.

* * *

ఏప్రిల్ మొదటి వారంలో వెళ్లటానికి నిర్ణయించుకున్నారు ఇద్దరూ. అప్పటికి స్కూల్లో పిల్లల పరీక్షలే కాకుండా పేపర్లు దిద్దటమూ అయిపోతుంది. బదరీనాథ్‌తో పాటు ఢిల్లీ, హరిద్వార్, రుషికేశ్

